RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:138

గురువారం
మే 28, 2026

పేజీలు 8
వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



2లో

## హైదరాబాద్ నగరంలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం!









### రైతన్న కష్టం నీళ్లపాలు

- తెలంగాణలో అకాల వర్షాల బీభత్సం
- కల్లాల్లోనే తడిసి ముద్దయిన ధాన్యం
- నెల రోజులైనా సాగని ధాన్యం కొనుగోళ్లు
- లారీలు, గన్నీ సంచుల కొరతతో కాలయాపన
- వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు
- చేతికొచ్చిన పంట పోయి అన్నదాతల ఆక్రందన
- అధికారుల నిర్లక్ష్యం.. కళ్లముందే కన్నీటి కష్టం

# సర్కార్ కొనలే.. వరుణుడు కనికరించలే!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణలో గత రెండ్రోజులుగా పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల భారీ వర్షాలు, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వ ఉదాసీనత కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నదాతలను నిలువునా ముంచేశాయి. గన్నీ సంచులు, లారీలు, హమాలీలు లేవనే సాకులతో అధికారులు, ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు సుమారు నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లను నాన్చడం వల్లే.. ప్రస్తుతం కల్లాల్లోనే వేలాది క్వింటాళ్ల రైతన్నల కష్టం నీటిలో తడిసి ముద్దయింది. రెక్కల కష్టం కళ్ల ముందే వరదపాలవుతుంటే గుండెలవిసేలా రోదిస్తున్న రైతాంగాన్ని ఆదుకోవాల్సింది పోయి, క్షేత్రస్థాయిలో మిల్లర్లు తేమ, తరుగు పేరిట సరికొత్త దోపిడీకి తెరలేపడం దారుణమని, ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేసి నిండా మునిగిన అన్నాదాతను గట్టెక్కించాలని కోరుతున్నారు.

2లో

## టీఎస్ఆర్టీసీలో కొత్తగా.. 60 ఎలక్ట్రిక్ బస్సులు!

- కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం చర్యలు
- 2027 నాటికి మరిన్ని ఈవీ బస్సులు
- కూకట్‌పల్లిలో కొత్త డిపో ఏర్పాటు
- ప్రజా రవాణా బలోపేతమే లక్ష్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్

2లో



## రేవంత్ ప్రభుత్వం వల్లే రైతుల అరిగోస

- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- కొనుగోలు కేంద్రాల సందర్శన

2లో

## గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్!



- టీ-ఫైబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- 3,089 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ
- ప్రతి ఇంటికి బ్రాడ్‌బ్యాండ్ సేవలే లక్ష్యం
- భారత్‌నెట్ అమలుపై సీఎం రేవంత్ సమీక్ష
- కేంద్ర మంత్రి సింధియాతో వీడియో కాన్ఫరెన్స్

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించే లక్ష్యంతో అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి పలు కీలక అంశాలను తీసుకెళ్లారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించిన ఒప్పందా న్ని త్వరగా కుదుర్చుకోవడంతో పాటు పెండింగ్ నిధులను విడుదల చేయాలని కోరారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ వరకు రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసే అంశంపై స్పష్టమైన విధానం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ సందర్భంగా

మిగతా 2వ పేజీలో

## భానుడి భగభగ ఎండలతో జాగ్రత్త

- వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలి
- పలు రాష్ట్రాల్లో తీవ్ర వడగాల్పులు
- వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు
- జంతువులు, పక్షులకు నీరు పెట్టాలి
- ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

2లో



వేద న్యూస్



# టీఎస్ఆర్టీసీలో కొత్తగా 60 ఎలక్ట్రిక్ బస్సులు!

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బస్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి జెండా ఊపి ఈవీ బస్సులను రోడ్లపైకి పంపించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణహిత ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా ప్రజలకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. 2027 నాటికి రాష్ట్రంలో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 960 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, అందులో హైదరాబాద్ నగరంలోనే 545 ఈవీ బస్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. ఇంటర్‌సిటీ సేవల కింద 580 బస్సులు నడుస్తున్నాయని వెల్లడించారు. మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. మొత్తం 3,000 ఎలక్ట్రిక్ బస్సులు అమల్లోకి వస్తే 600 టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ మరో ఢిల్లీలా కాలుష్య నగరంగా మారకుండా ఉండేందుకే ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరల ప్రభావం ప్రజా రవాణాపై తీవ్రంగా ఉంటోందని, దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్ బస్సులు మంచి పరిష్కారమని పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రస్తుతం 10 వేల బస్సులు ఉండగా, అందులో 1,000 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని వెల్లడించారు. జంట నగరాల్లో రోజుకు 35 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల ట్రాఫిక్ తగ్గడమే కాకుండా కాలుష్యం కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో పలు సంస్కరణలు చేపట్టామని మంత్రి తెలిపారు. కొత్త నియామకాలు, కొత్త బస్సుల ప్రవేశంతో ఆర్టీసీ దేశంలోనే ఉత్తమ సంస్థగా నిలుస్తోందన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి నెల రెండో మంగళవారం డీఎంలు, ఆర్ఎంలు, ఉన్నతాధికారులు కార్మికుల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. త్వరలోనే ఆర్టీసీ సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి, అనంతరం సంఘాల ప్రతినిధులతో సమావేశమై సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 310 కోట్ల టికెట్లను వినియోగించుకున్నారని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు కేపీహెచ్‌బీలో కొత్త డిపో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా 5 ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేసేందుకు అధికారులకు సూచనలు ఇచ్చారు. ఇకపై కూకట్‌పల్లి ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఈవీ బస్సులు విస్తృతంగా నడుస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ నగరంలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం!

- పేదల సొంతింటి కలకు ఊతం
- శిథిల భవనాల వినియోగానికి ప్రణాళిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- హైదరాబాద్‌లో స్థలాల పరిశీలన

**వేద న్యూస్, హైదరాబాద్**

రాష్ట్రంలో పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. తొలి విడతలో హైదరాబాద్ నగరంలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. నగరంలో పెరుగుతున్న నివాస సమస్యను దృష్టిలో ఉంచుకుని పేదలకు గౌరవప్రదమైన గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రణాళిక ద్వారా వేలాది కుటుంబాలకు స్థిరమైన నివాస భద్రత కల్పించనున్నట్లు తెలిపారు. బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కలిసి నాంపల్లి, మలక్‌పేట్, బహదూర్‌పురా నియోజకవర్గాల్లో ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించారు. ఈ పర్యటనలో పలు ప్రభుత్వ భూములు, ఖాళీ ప్రదేశాలను పరిశీలిస్తూ భవిష్యత్ గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలపై అధికారులతో చర్చించారు. నగరంలో అందుబాటులో ఉన్న భూములను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు ఇళ్లను అందించాలనే దిశగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా కుల్సుంపురా, అఫ్జల్ సాగర్ ప్రాంతాలతో పాటు కాలదేరా, గడ్డియన్నారం ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను కూడా పరిశీలించారు. ప్రస్తుతం వినియోగంలో లేని ప్రభుత్వ భూములు, పాడుబడిన భవనాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చి గృహ నిర్మాణానికి ఉపయోగించనున్నట్లు మంత్రి తెలిపారు. నగరంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించడం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన జీవన వసతులు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరంలో అద్దె భారం భరించలేక ఇబ్బందులు పడుతున్న పేదలు, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా ఉపాధి కోసం నగరానికి వచ్చే కుటుంబాలకు సురక్షితమైన నివాస వసతి కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఎల్ఐజీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన స్థలాల గుర్తింపు, ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే అధికారులు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలతో కూడిన సమగ్ర కాలనీలుగా ఈ గృహ సముదాయాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నగరాభివృద్ధికి అనుగుణంగా ఆధునిక సౌకర్యాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తొలి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం, భవిష్యత్తులో మరిన్ని గృహ నిర్మాణ ప్రాజెక్టులను కూడా చేపట్టే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. నగరంలో పెరుగుతున్న జనాభా, నివాస అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. పేదలకు గృహ వసతి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ అసలు లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## సర్కార్ కొనలే..

# వరుణుడు కనికరించలే!



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

అటు సర్కార్ నయవంచన.. ఇటు వరుణ దేవుడి కన్నెర్ర.. వెరసి తెలంగాణలో అన్నదాతల బతుకులు ఆగమైపోయింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అధికారులు, మిల్లుల యజమానులు కుమ్మక్కై ధాన్యం కొనకుండా రోజుల తరబడి, వారాల తరబడి ఆలస్యం చేసినందుకే నేడు అన్నదాతలకు ఈ ఘోర దుస్థితి దాపురించింది. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లు, మక్కలను విక్రయించడానికి రైతులు సుమారు నెల రోజులుగా మార్కెట్ల ముందు, ఐకేపీ కేంద్రాల వద్ద, రహదారుల పక్కన పడిగాపులు కాస్తున్నా పాలకులలో కనీస చలనం లేకుండా పోయింది. హమాలీలు లేరని, లారీలు రావడం లేదని, గన్నీ బ్యాగుల కొరత ఉందంటూ అధికారులు రోజుకో సాకు చెబుతూ కాలయాపన చేయడంతో.. చివరకు అన్నదాతల శ్రమంతా అకాల వర్షాల పాలైంది.

### పట్టించుకోని పాలకులు

రెక్కలు ముక్కలు చేసుకుని, కన్నబిడ్డలా కాపాడుకుంటూ వచ్చిన పంట కళ్ల ముందే వరద నీటిలో కొట్టుకుపోతుంటే, 'రైతన్న బతుకు ఎప్పటికీ ఇంతేనా?' అంటూ అన్నదాతలు గుండె లవిసేలా రోదిస్తున్నారు. విత్తనాలు, యూరియా కొనుగోలు దగ్గర నుండి పండించిన పంటను అమ్ముకునే వరకు ప్రతి దశలోనూ రోడ్లపై క్యూలైన్లలో నిలబడటమే తమ బతుకైపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రతకు వడదెబ్బలు తగిలి కొనుగోలు కేంద్రాల వద్దే దాదాపు 10 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోతున్నా, అకాల వర్షాలకు సర్వస్వం కోల్పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు.

### సకాలం కొనుగోలు చేసుంటే..

ప్రభుత్వం సకాలంలో రవాణా వసతులు కల్పించి, మిల్లులకు ధాన్యం తరలించి, తూకాలు వేసి ఉంటే ఈపాటికి పంట అంతా సురక్షితంగా గోదాములకు చేరేదని రైతాంగం చెబుతోంది. సర్కార్ చేసిన నయవంచన, కాలయాపన వల్లే తమ శ్రమంతా అకాల వర్షాల పాలైందని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందడం వల్లే తాము ప్రకృతి విపత్తుకు బలికావాల్సి వచ్చిందని, ఐకేపీ కేంద్రాలు చెరువులను తలపిస్తున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు.



## రైతన్న కష్టం నీళ్లపాలు

- తెలంగాణలో అకాల వర్షాల బీభత్సం
- కల్లాల్లోనే తడిసి ముద్దయిన ధాన్యం
- నెల రోజులైనా సాగని ధాన్యం కొనుగోళ్లు
- లారీలు, గన్నీ సంచుల కొరతతో కాలయాపన
- వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు
- చేతికొచ్చిన పంట పోయి అన్నదాతల ఆక్రందన
- అధికారుల నిర్లక్ష్యం.. కళ్లముందే కన్నీటి కష్టం

### ఇన్ని విధాల మునుగుతున్నా..

ఇలా అన్ని విధాలుగా నిండా మునిగిన రైతన్నను ఆదుకోవడానికి ప్రభుత్వం తదుపరి చర్యలు ఏమైనా తీసుకుంటుందా? లేదా? అనే ఆందోళన ఇప్పుడు క్షేత్రస్థాయిలో వేధిస్తోంది. కళ్లాల్లో ఉన్న వడ్లు, మక్కలు తడిసిపోవడంతో అప్పుడే తేమ, తాలు నెపంతో క్షేత్రస్థాయిలో మిల్లర్లు, అధికారులు తరుగు పేరిట క్వింటాళ్లకు కిలోల కొద్దీ కోతలు విధిస్తూ అదనపు తూకాలతో దోపిడీకి తెరలేపారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ప్రకృతి దెబ్బకు సగం పంట నష్టపోతే, మిగిలిన దానికి కూడా మిల్లర్లు తరుగు కోతలు విధిస్తుండటంతో అన్నదాతలు నిలువునా లబోదిబోమంటున్నారు.

### ఎక్కడికక్కడ తడిసిన గింజలు

ప్రకృతి కన్నెర్ర చేసి పంటంతా తడిసి ముద్దయిన వేళ.. కనీసం ఈ తడిసిన ధాన్యాన్నైనా ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేస్తుందా? లేదా? అని రైతాంగం ఎదురుచూస్తోంది. ఒకవైపు ఎండ తీవ్రతకు అల్లాడి, మరోవైపు వాన దెబ్బకు కుప్పకూలి, అన్ని రకాలుగా సర్వస్వం కోల్పోయిన శ్రమజీవికి అండగా నిలవాల్సిన బాధ్యత పాలకులపై ఉందనే వాదనలు గట్టిగా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్ ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో ఉన్న దైన్య పరిస్థితిని గమనించి తక్షణమే స్పందించకపోతే రైతాంగం మరింత సంక్షోభంలోకి కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉంది.

### న్యాయం చేయాలి..

ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మానవత్వంతో స్పందించి, ఎలాంటి ఆంక్షలు, తేమ నిబంధనలు, తరుగు కోతలు లేకుండా తడిసిన, రంగు మారిన ప్రతి గింజనూ కనీస మద్దతు ధరకే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లారీల సంఖ్యను పెంచి, గన్నీ సంచులను యుద్ధప్రాతిపదికన సరఫరా చేసి కళ్లాల్లో ఉన్న మిగిలిన పంటనైనా త్వరగా మిల్లులకు తరలించాలని కోరుతున్నారు. దగాపడ్డ అన్నదాతను కాపాడటానికి ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ప్యాకేజీ లేదా నష్టపరిహారం ప్రకటించి ఆదుకోవాలని, లేదంటే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతాయని రైతాంగం కన్నీటితో వేడుకుంటోంది.

# రేవంత్ ప్రభుత్వం వల్లే రైతుల అరిగోస


**వేద న్యూస్, సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంతో పాటు గోనపల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీశ్ రావు సందర్శించారు. అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్న రైతులను ఓదారుస్తూ అధైర్యపడొద్దని, తమ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనకపోవడం వల్లే రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన టి హరీశ్ రావు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. వడ్లు, మక్కలు, సన్‌ఫ్లవర్, శనగలు, జొన్నల కొనుగోళ్ల విషయంలో రెండు ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై నెపం నెడుతుంటే, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకులు ఇక్కడ ధర్నాలు చేయడం రాజకీయ నాటకమని విమర్శించారు. ఎఫ్‌సీఐ లెవీ కోటా, ఎరువుల కోటాను కేంద్రం సకాలంలో ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులను గాలికి వదిలేసిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఎరువులు, ధాన్యం కొనుగోళ్లలో ఎప్పుడూ ఇబ్బందులు రాలేదని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు కాళేశ్వరం జలాలతో రైతులకు బంగారు పంటలు అందించారని గుర్తు చేశారు. సాధారణంగా రోహిణీ కార్తె నాటికి వడ్ల కొనుగోళ్లు పూర్తవుతాయని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆన్‌లైన్ ట్యాగింగ్, కొత్త నిబంధనల పేరుతో నెలరోజులుగా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి 80 శాతం వడ్లు కొనుగోలు చేశామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇంకా సగం ధాన్యం కల్లాల్లోనే ఉందని అన్నారు. తడిసిన వడ్లు మొలకెత్తి పూర్తిగా పాడవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. రైస్ మిల్లర్లు బస్తాకు 43 కిలోలు పెట్టితేనే ధాన్యం దించుకుంటామని రైతులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఏ–గ్రేడ్ వడ్లను కూడా బీ–గ్రేడ్‌గా నమోదు చేసి రైతులకు భారీ నష్టం కలిగిస్తున్నారని తెలిపారు. క్వింటాకు తరుగు పేరుతో 3 నుంచి 5 కిలోల వరకు కోత విధిస్తూ రైతులపై అదనపు భారం మోపుతున్నారని అన్నారు. రవాణా, హమాలీ, ట్రాక్టర్ వెయిటింగ్ ఛార్జీలు కూడా రైతులే భరించాల్సి వస్తోందని విమర్శించారు. వెంటనే ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి తడిసిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో లారీలు అందుబాటులో ఉండవని, కాబట్టి వారం రోజుల పాటు ఇసుక రవాణాను నిలిపివేసి ఆ లారీలను ధాన్యం రవాణాకు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు ప్రాధాన్యత ఇస్తుందా, లేక ఇసుక ఆదాయానికా అన్నది స్పష్టం చేయాలని ప్రశ్నించారు.

# గ్రామాలకు హైస్పీడ్ ఇంటర్నెట్!

మొదటి పేజీ తరువాయి

- టీ-ఫైబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- 3,089 గ్రామాల్లో డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ
- ప్రతి ఇంటికి బ్రాడ్‌బ్యాండ్ సేవలే లక్ష్యం
- భారత్‌నెట్ అమలుపై సీఎం రేవంత్ సమీక్ష
- కేంద్ర మంత్రి సింధియాతో వీడియో కాన్ఫరెన్స్




తెలంగాణలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే లక్ష్యంపై విస్తృతంగా చర్చించారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని జ్యోతిరాదిత్య సింధియా హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రయోజన సంస్థను ఏర్పాటు చేసి కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనను కూడా వెల్లడించింది. రాష్ట్రంలో ఏకీకృత డిజిటల్ విధానంతో టీ–ఫైబర్ నెట్‌వర్క్‌ను విస్తరించి ప్రతి గ్రామ పంచాయతీని రింగ్ ఆర్కిటెక్చర్ విధానంలో అనుసంధానించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఒక మార్గంలో అంతరాయం ఏర్పడినా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు కొనసాగేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు నిరంతర బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తొలి దశలో నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరించనున్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆధునిక ఫైబర్ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలకు కూడా పట్టణాల స్థాయి సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కె. రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. డిజిటల్ తెలంగాణ లక్ష్య సాధనలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఎండలతో జాగ్రత్త

- వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలి
- పలు రాష్ట్రాల్లో తీవ్ర వడగాల్పులు
- వడదెబ్బ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు
- జంతువులు, పక్షులకు నీరు పెట్టాలి
- ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు

**వేద న్యూస్, నేషనల్ బ్యూరో**



దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తీవ్రమైన వేడి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజలకు జాగ్రత్తలు వివరించారు. మధ్యాహ్న సమయంలో వీలైనంత వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. నిత్యం తగినంత నీరు తాగాలని నరేంద్ర మోదీ ప్రజలకు సూచించారు. తీవ్రమైన ఎండల ప్రభావం నుంచి తమను తాము కాపాడుకోవాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. ఇతరులకు సహాయం చేయాలని, ఇళ్లు, దుకాణాల వద్ద పక్షులు, జంతువుల కోసం నీటిని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వడదెబ్బ లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని ప్రధాని హెచ్చరించారు. తల తిరగడం, వికారం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎవరైనా అకస్మాత్తుగా స్పృహ కోల్పోయినా, నీరసంగా కనిపించినా వెంటనే వారిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలని సూచించారు. ఇలాంటి సమయాల్లో అప్రమత్తత ఒక ప్రాణాన్ని కాపాడగలదని పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు, రైతులు, కార్మికులపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటోందని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ వర్గాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాల్పుల సమయంలో బయట పనులు తగ్గించుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాబోయే రోజుల్లో ఢిల్లీ–ఎన్సీఆర్ ప్రాంతంలో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, బీహార్, ఒడిశా, తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మే 29 నుంచి ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అప్రమత్తంగా ఉన్నాయి. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి అధికారుల సూచనలు పాటించాలని అధికారులు కోరుతున్నారు.

వేద న్యూస్

గురువారం మే 28 , 2026

# మూడో రోజుకు ఐకేపీ వీవోఏల సమ్మె

- కనీస వేతనం, బీమా సౌకర్యం కల్పించాలి
- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తాం



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని మండల సమీకృత కార్యాలయం ఎదుట ఐకేపీ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు జరీనా బేగం మాట్లాడుతూ.. వీవోఏలకు నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అలాగే 58 జీవో సవరణతో పాటు రూ.20 లక్షల వరకు ఆరోగ్య, సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు జిజియా భాయ్, కార్యదర్శి స్వరూప, సహాయ కార్యదర్శి నాగరాణి, కోశాధికారి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పానీపూరి తిని 15 మందికి అస్వస్థత!

- వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు
- గద్వాల జిల్లా అయిజలో ఘటన
- ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



**వేద న్యూస్, అయిజ:**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో కలుషిత ఆహారం కలకలం రేపింది. పాత బస్టాండ్ సమీపంలోని ఓ పానీపూరి దుకాణంలో ఆహారం తిన్న సుమారు 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులకు వాంతులు, విరేచనాలు రావడంతో వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కలుషిత ఆహారం కారణంగానే ఈ ఘటన జరిగినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పట్టణంలో అపరిశుభ్ర పరిస్థితుల్లో ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఆహార విక్రయ కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# పారిశుధ్య సిబ్బందిని కార్మికులుగా గుర్తించాలి

- పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసిన సీపీఐ-ఏఐటీయూసీ నేతలు


**వేద న్యూస్, నల్లబెల్లి :**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని సిపిఐఏఐటీయూసి నాయకులు రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు. శ్రామిక చట్టాల పరిధిలో మల్టీపర్పస్ వర్కర్లకు పీఎఫ్, ఇన్సూరెన్స్, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు చింతకింది కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు మంత్రిని కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసి మండల గౌరవ అధ్యక్షుడు జన్ను సుదర్శన్, అధ్యక్షుడు మామిడిపల్లి సంపత్, ఉపాధ్యక్షుడు అంబిరాజు, కోశాధికారి మామిడిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



# ఇందల్వాయిలో పోలీసుల విస్తృత తనిఖీలు

- అక్రమ పశువుల రవాణాపై ఏసీపీ ప్రకాష్ హెచ్చరిక
- టోల్‌గేట్, ఎద్దుల మార్కెట్ వద్ద నిఘా




**వేద న్యూస్, ఇందల్వాయి:**

బక్రీద్ పండుగ నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఇందల్వాయి మండల కేంద్రంలో బుధవారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమ పశువుల రవాణా నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఏసీపీ ప్రకాష్ స్వయంగా తనిఖీలను పర్యవేక్షించారు. మండల కేంద్రంలోని ఎద్దుల మార్కెట్ వద్ద పశువుల కొనుగోలు, అమ్మకాల వివరాలను పరిశీలించిన పోలీసులు రవాణా అనుమతి పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకుండా పశువుల రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు. అనంతరం ఇందల్వాయి టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. పండుగ సమయంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా పెంచినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి ఎస్సై సందీప్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు

- పార్టీ జెండా ఆవిష్కరించిన నాయకులు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని రాయకూర్ క్యాంపు, రుద్రూర్ గ్రామ బస్టాండ్ ప్రాంగణంలో బుధవారం 44వ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాన్సువాడ నియోజకవర్గ టీడీపీ నాయకులు షేక్ మతీన్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబం సాయిలు, కోర్బ దత్తు, జెర్రి నర్సింలు, పి. నరేంద్రబాబు, వై. సాంబశివరావు, పార్టీ కార్యకర్తలు సయ్యద్ రిజ్వాన్, ఉషీన్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన

- పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం అర్నకొండ గ్రామం నుంచి మల్యాల క్రాస్ రోడ్డు వరకు రెండు వరుసల రహదారి నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.50 కోట్ల నిధులతో చేపడుతున్న ఈ పనులకు కరీంనగర్ ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం కలిసి ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ రహదారి నిర్మాణంతో కొండగట్టు పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులు, ప్రయాణికులకు రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ సిద్ధాంతాలు, అభివృద్ధి దృక్పథం, ప్రజాసేవ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ధ్యేయంగా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు ప్రకటించారు. తెలంగాణ రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట ఇన్చార్జ్ చాడ మరియా అధ్యక్షతన టిడిపి వర్చువల్ డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని బుధవారం వరంగల్ నగరంలోని ఎల్బీనగర్ లో ఓ ప్రైవేట ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు దేశ అభివృద్ధికి ముఖ్యంగా హైదరాబాద్ తెలంగాణ ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలను గుర్తు చేశారు. హైదరాబాదులో ఐటీ రంగా విస్తరణ మౌలిక వసతుల అభివృద్ధి యువతకు ఉపాధి అవకాశాల కల్పనతో హైదరాబాద్ నగరాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చి దిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు సురేఖ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, నాయకులు జి.ఎల్ శ్రీధర్, పాషికంటి రమేష్, శరత్ హనుమకొండ సాంబయ్య, నల్లకుంట రవి, నాగవెల్లి సురేష్, బైరపాక ప్రభాకర్, ముక్కిరాల జనార్దన్ రావు, కందుకూరి నరేష్, పిట్టల శ్రీనివాస్, పోతరాజు అనిల్, నీలం పరుశురాములు, నల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

గురువారం మే 28 , 2026

# పెద్ద చెరువు కబ్జాపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



**వేద న్యూస్, ఇందల్వాయి:**

ఇందల్వాయి మండల కేంద్రంలోని పెద్ద చెరువు కబ్జా వ్యవహారంపై స్థానిక ప్రజాప్రతినిధులు, వీడీసీ సభ్యులు బుధవారం రూరల్ ఎమ్మెల్యే డా. రేకులపల్లి భూపతిరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందిస్తూ కబ్జాకు గురైన శికం భూమిని వెంటనే సర్వే చేసి టెన్సింగ్ వేయాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే సమయంలో గ్రామస్థులు సహకరించాలని కోరారు. అనంతరం సర్పంచ్, ఉపసర్పంచ్, వీడీసీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, బొకేతో సన్మానించారు. గ్రామంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోకాని గంగామణి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వీడీసీ అధ్యక్షుడు కాజాపురం మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, సభ్యులు హన్మంత్, జితేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



**వేద న్యూస్, చొప్పదండి:**

గంగాధర మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మంత్రి మహేందర్, చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, చొప్పదండి టౌన్ అధ్యక్షుడిగా నిజాంపురం చందు నూతనంగా నియమితులైన సందర్భంగా అర్ణకొండ గ్రామంలో ఘనంగా సన్మానించారు. కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యం పేట సర్పంచ్ దారం ఆది రెడ్డి, మల్యాల ప్యాక్స్ చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి, బల్వంతపూర్ సర్పంచ్ కరుణ గణేష్, దేశరాజ్‌పల్లి సర్పంచ్ కోల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పెరమాండ్ల మానస గంగన్న, జిల్లా మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గుంటి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరిన వీవోఏల నిరాహార దీక్ష

**– తహసీల్దార్ కార్యాలయం ఎదుట మిన్నంటిన నినాదాలు**



**వేద న్యూస్, ఇందల్వాయి:**

ఇందల్వాయి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐకేపీ ఆధ్వర్యంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వివోఏలు) చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వివోఏలు నినాదాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ.. గ్రామీణ మహిళా సంఘాల బలోపేతానికి రాత్రింబవళ్లు పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమకు సరైన గుర్తింపు, వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య భద్రత, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, 58వ జీవోను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సరళ, కవిత, లావణ్య, సువర్ణ, కిషన్, రాధిక, భాగ్య, స్వప్న, అజిత తదితరులు పాల్గొన్నారు.

# వీవోఏల న్యాయమైన డిమాండ్లు అమలు చేయాలి

**– రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్**

**– మూడో రోజుకు చేరిన నిరవధిక దీక్ష**



**వేద న్యూస్, ధర్పల్లి:**

ధర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఐకేపీ ఆధ్వర్యంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వివోఏలు) చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వివోఏలు మాట్లాడుతూ గ్రామీణ మహిళా సంఘాల బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమకు తగిన గుర్తింపు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆరోగ్య భద్రత, ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, 58వ జీవోను రద్దు చేయాలని, అర్హులైన వివోఏలకు సీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎంఎల్ నాయకులు బాలయ్య, నయూమ్‌తో పాటు అలేఖ్య, కవిత, మంజుల, వనజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# వీవోఏల సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం

**– డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



**వేద న్యూస్, వేములవాడ రూరల్ :**

వేములవాడ కేంద్రంలో గత తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఐకేపీ వివోఏలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివోఏలకు రూ.20 వేల వేతనం ఇవ్వడంతో పాటు సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే బీమా, ట్యాబ్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతులు ఇవ్వాలని, జీవో 58ను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి, సర్పంచులు ఊరడి సునీత-రాజిరెడ్డి, ముత్త సంజన-మహేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, సుమన్, దేవరాజు, గోపు మధు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# గౌరారంలో భూ కబ్జా!





- 25 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిలోకి అక్రమ ప్రవేశం
- మామిడి, ఉసిరి చెట్ల నరికివేత
- అడ్డుకున్న రైతుపై బెదిరింపులు
- తహశీల్దార్, పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- న్యాయం చేయాలని రైతు వేడుకోలు

**వేద న్యూస్, ఇందల్వాయి:**

ఇందల్వాయి మండల పరిధిలోని గౌరారం గ్రామ శివారులో భూ కబ్జా యత్నం ఉద్రిక్తతకు దారితీసింది. బాధిత రైతు చెలమెల నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నెంబర్ 180లోని భూమిని తాను గత 25 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సరిహద్దు వివాదం సృష్టిస్తూ తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించారని ఆరోపించారు. అక్కడ ఉన్న మూడు పెద్ద మామిడి చెట్లతో పాటు ఉసిరి చెట్లు, ఇతర చిన్న చెట్లను నరికివేసినట్లు వాపోయారు. తాను అడ్డుకోవడానికి వెళ్లగా దుర్భాషలాడుతూ చంపేస్తామని బెదిరించారని తెలిపారు. ఈ ఘటనపై ఇందల్వాయి తహశీల్దార్, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తన భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని రైతు నర్సయ్య అధికారులను వేడుకున్నారు.

# యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే దంపతుల పూజలు



**వేద న్యూస్, దేవరకద్ర:** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కవిత మధుసూదన్ రెడ్డి దంపతులు తమ వివాహ వార్షికోత్సవ సందర్భంగా బుధవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దంపతులను కూర్చోబెట్టి ఆలయ సాంప్రదాయం ప్రకారం పూలమాలలు వేసి అక్షింతలతో అభిమానులు, హర్షకులు ఆశీర్వదించారు.

# మహిళా సంఘ భవనాలకు భూమి పూజ

**– ఎండపల్లి మండలంలో పలు గ్రామాల్లో శంకుస్థాపనలు**



**వేద న్యూస్, ఎండపల్లి :**

ఎండపల్లి మండల పరిధిలోని ఉండడా, ముంజంపల్లి, మారేడుపల్లి, గుడిసెలపేట గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా భవనాలు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పీఆర్ ఏఈలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ గొల్ల తిరుపతి, స్థానిక సర్పంచులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బక్రీద్ ఏర్పాట్లను పరిశీలించిన చైర్‌పర్సన్



**వేద న్యూస్, ధర్మపురి:**

బక్రీద్ పండుగ సందర్భంగా ధర్మపురి పట్టణంలోని ఈద్గా వద్ద చేపట్టిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పరిశీలించారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రత, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ప్రజలంతా ఆనందంగా, ప్రశాంతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్ సువర్ణ, ఎస్ఐ మహేష్, కోఆప్షన్ సభ్యుడు షేక్ షౌకత్, ముస్లిం సోదరులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ధర్మపురి అభివృద్ధికి మరో ముందడుగు

- డిగ్రీ కళాశాలలో టాయిలెట్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- 13వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల ప్రారంభం

**వేద న్యూస్, ధర్మపురి:**



ధర్మపురి పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని నూతన డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అదేవిధంగా 13వ వార్డులో ప్రజల సౌకర్యార్థం సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, విద్యాసంస్థల్లో అవసరమైన సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ధర్మపురి అభివృద్ధికి రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, వార్డు కౌన్సిలర్లు రాజేష్, ఆనంద్, సువర్ణ, లక్ష్మణ్, ప్రశాంత్, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు 'పోష్' చట్టం రక్ష

- ధర్మపురిలో అవగాహన సదస్సు
- మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి
- చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి

**వేద న్యూస్, ధర్మపురి:**



జగిత్యాల జిల్లా మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై వేధింపుల నిరోధక చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని తెలిపారు. కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రదేశాల్లో మహిళల భద్రతకు పోష్ చట్టం కీలకమని పేర్కొన్నారు. మహిళలు తమ హక్కులను తెలుసుకొని సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, మహిళా సంఘాల కార్యకర్తలు, మహిళా సంక్షేమ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# దగ్ధమైన తాటి వనాలతో గీత కార్మికులకు భారీ నష్టం

- నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి: సంఘం నాయకులు

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అగ్నిప్రమాదాల్లో దగ్ధమైన తాటి ఈత వనాలను తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. కమలాపూర్‌లో సుమారు 1000, శనిగరం గ్రామంలో 200, గూనిపర్తిలో 800 తాటి ఈత చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి బండి రంజిత్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తాటి చెట్లపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులకు ఇది తీవ్ర నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన గీతా కార్మికులకు తక్షణ సహాయం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గీత వృత్తి ఆధునీకరణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, గౌడ సంఘం నాయకులు, గీత కార్మికులు పాల్గొన్నారు.

# రైతుల కష్టం నీళ్లపాలు

- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి
- హస్నాపూర్‌లో రైతులను పరామర్శించిన ఆల వెంకటేశ్వర్ రెడ్డి



**వేద న్యూస్, దేవరకద్ర/భూత్పూర్:**

భూత్పూర్ మండలం హస్నాపూర్‌లో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించి రైతులను పరామర్శించారు. అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో కల్లాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు నష్టపోతున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, లంచాల పేరుతో రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఐకేపీ కేంద్ర నిర్వాహకుడు బస్తాకు అదనంగా రూ.15 డిమాండ్ చేస్తున్నాడని రైతులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తాతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని, రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# గంగాధర మండలంలో విద్యా సామగ్రి పంపిణీ

- 100శాతం పంపిణీ లక్ష్యంగా చర్యలు
- ఎంఈఓ ప్రభాకర్ రావు




**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూడైస్+ వివరాల ప్రకారం మండలంలోని పాఠశాలలకు మొత్తం 25,708 పాఠ్యపుస్తకాలు, 24,092 నోట్‌బుక్స్, 1,845 హైస్కూల్ ప్రోగ్రెస్ కార్డులు, 911 ప్రాథమిక పాఠశాల ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి ఏనుగు ప్రభాకర్ రావు మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభానికి ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రతి విద్యార్థికి మొదటి రోజే అవసరమైన విద్యా సామగ్రి అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా మే 11 నుంచి జూన్ 13 వరకు బడిబాట కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ నాయకులకు పరామర్శ

**వేద న్యూస్, వనపర్తి :**



వనపర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ నాయకులు అక్తర్ హార్ట్ ఆపరేషన్ చేయించుకోగా, 33వ వార్డు సీనియర్ నాయకుడు అబ్దుల్లా రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న చిన్నారెడ్డి, వైద్యుల సూచనలు పాటిస్తూ పౌష్టికాహారం తీసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, సీనియర్ నాయకులు ద్వారాపోగు విజయ్ బాబు, నందిమల్ల రామ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.

## దుబాయ్ ఉద్యోగాలకు

# 'టామ్‌కామ్' దరఖాస్తుల ఆహ్వానం

- జగిత్యాల నిరుద్యోగులకు విదేశీ ఉద్యోగావకాశం
- ఉచిత వసతి, రవాణా సదుపాయాలు

**వేద న్యూస్, జగిత్యాల:**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ద్వారా దుబాయ్‌లో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి బి. స్వప్న తెలిపారు. యుటిలిటీ మెయింటెనెన్స్, పెయింటింగ్ కార్పెంటర్, అసిస్టెంట్ బాయిలర్, స్టీల్ ఫిక్సర్, స్కాఫోల్డర్, జనరల్ హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, నైపుణ్య ఉద్యోగాలకు కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. నైపుణ్య ఉద్యోగాలకు నెలకు ఏఈడీ1453 జీతంతో పాటు ఫుడ్ అలవెన్స్, ఓవర్‌టైమ్ ఉంటాయని తెలిపారు. జనరల్ హెల్పర్లకు ఏఈడీ 1200 జీతం చెల్లిస్తారని చెప్పారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, రవాణా సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tomcom.resume@gmail.comకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు టామ్‌కామ్ అధికారిక వెబ్‌సైట్‌ను లేదా 8328602231, 9440050951, 9440051452 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# ట్యాంకర్ల ద్వారా ఉచిత నీటి సరఫరా

**వేద న్యూస్, నక్కపల్లి :**



అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చిన్న దొడ్డిగల్లు గ్రామంలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా అందించేందుకు నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా మంచినీటి పంపిణీ చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షులు వెలగా సుధాకర్ రావు పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో తమ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన తెలిపారు. గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజల ఆరోగ్యం కోసం శుభ్రమైన తాగునీరు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కే. గణేష్, కే. పెద్ద బాబ్జి తదితరులు కూడా పాల్గొని మంచినీటి సరఫరా ఏర్పాట్లను పరిశీలించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా నీటి సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థులు కూడా ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ, తమ గ్రామానికి అవసరమైన సేవలు అందిస్తున్న నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు యువకులు, మహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

వేద న్యూస్

గురువారం మే 28 , 2026

ఎరువుల దుకాణాలపై

# ఆకస్మిక తనిఖీలు

**- యూరియా బ్లాక్ మార్కెట్‌పై ప్రత్యేక నిఘా**

**వేద న్యూస్, జగిత్యాల/సారంగాపూర్:**

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో రైతులకు ఎరువుల కొరత లేకుండా చూసేందుకు జగిత్యాల జిల్లా, మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారులు సారంగాపూర్ మండలంలోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు ఏడీఏ (టెక్) రాజుల నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఎరువుల స్టాక్ రిజిస్టర్లు, విక్రయ వివరాలు, పీఓఎస్ యంత్రాల ద్వారా అమ్మకాలు, ధరల పట్టికలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం లేదా అధిక ధరలకు విక్రయించడం జరిగితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా ఎరువులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# నవభారత నిర్మాత నెహ్రూకు నివాళులు

## - శాయంపేటలో స్మరించుకున్న కాంగ్రెస్ నేతలు



వేద న్యూస్, శాయంపేట: మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా శాయంపేటలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణానికి నెహ్రూ విశేష కృషి చేశారని అన్నారు. ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద పరిరక్షణ కోసం ఆయన 17 సంవత్సరాలు ప్రధానిగా సేవలందించారని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులు, కర్మాగారాల స్థాపనకు నెహ్రూ పునాదులు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, డిసిసి ఉపాధ్యక్షుడు పోలేపల్లి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

**- పెద్దకొడేపాకలో దగ్ధమైన ఇళ్ల పరిశీలన**

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట మండలంలోని పెద్దకొడేపాక గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో అబ్బు జనార్ధన్ రెడ్డి, అబ్బు రాజిరెడ్డి, అబ్బు మార్రెడ్డి కుటుంబాలకు చెందిన ఇళ్లు, వరి గడ్డి, వ్యవసాయ పనిముట్లు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులను ఓదార్చి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులు, అధికారులకు సూచించారు. అలాగే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# వెంకట్రాములు చిత్ర పటానికి ఎమ్మెల్సీ నివాళి

**- కుటుంబ సభ్యులను ఓదార్చిన కేతావత్ శంకర్ నాయక్**



**వేద న్యూస్, నల్గొండ:**

వేములపల్లి మండలం ఆమనగల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత దేశబోయిన వెంకట్రాములు(76) అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వెంకట్రాములు కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారని ఎమ్మెల్సీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలికాంతారెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసులో

# ముగ్గురు అరెస్ట్

**వేద న్యూస్, ధర్పల్లి:**




ధర్పల్లి మండలం గోవింద్‌పల్లి గ్రామంలో అదనపు వరకట్న వేధింపుల కారణంగా రక్షిత అలియాస్ కవిత మృతి చెందిన కేసులో పోలీసులు వేగంగా చర్యలు చేపట్టి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ధర్పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిజామాబాద్ ఏసీపీ ఆదేశాల మేరకు ధర్పల్లి సీఐ, ఎస్సై వినయ్ తమ సిబ్బందితో కలిసి గోవింద్‌పల్లి గ్రామంలో నిందితులు కర్రోళ్ల నెహ్రూ, సత్తెమ్మ, రాజులులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సెల్‌ఫోన్‌తో పాటు ఉరివేసుకోవడానికి ఉపయోగించిన చీరను కీలక ఆధారాలుగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వైద్య పరీక్షల తర్వాత కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన ఏసీపీ బి. ప్రకాష్, సీఐ బిక్షపతి, ఎస్సై వినయ్‌తో పాటు ధర్పల్లి పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించారు.

సీఎం రిలీఫ్ ఫండ్

# చెక్కు పంపిణీ



**వేద న్యూస్,నక్కపల్లి :**

నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామంలో తీవ్ర అనారోగ్యతో బాధపడుతున్న వి. సుబ్బలక్ష్మి బాధితురాలికి సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 49 వేలు పత్రాలును టీడీపి జిల్లా ప్రతినిది నానేపల్లి రాఘవులు, మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ, జనసేన మండల ఉపాధ్యక్షుడు నల్లల రత్నాజీ మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరణం రాఘవ, నల్లల నారాయణరావు, గెడ్డమూరి రమణ, గాంధీ, చరణ్, రవి, రాజేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి పరిరక్షణకు తహసీల్దార్‌కు వినతి

## - మహిళా సంఘాలకు భూమి అప్పగించాలని సర్పంచ్ విజ్ఞప్తి

**వేద న్యూస్, సారంగాపూర్:**



సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామపంచాయతీ పరిధిలో బృహత్ పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని కబ్జా కాకుండా పరిరక్షించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ బాస మహేష్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 556లో సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో రెవెన్యూ అధికారుల సమక్షంలో గ్రామపంచాయతీకి ప్రకృతి వనం అభివృద్ధి కోసం అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుతం అదే భూమిలో ప్రభుత్వ నిధులతో రైస్ మిల్, గోదాం నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ నిర్మాణాలతో ప్రభుత్వ భూమి అక్రమ కబ్జాలకు గురికాకుండా పరిరక్షించబడటంతో పాటు గ్రామ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చెందుతుందని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆ భూమిని రేచపల్లి గ్రామ మహిళా సమాఖ్య సంఘాలకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌కు సమర్పించిన వినతిపత్రం జిరాక్స్ ప్రతులను సారంగాపూర్ మండల సమాఖ్య ఏపీఎం చంద్రకళ ఆధ్వర్యంలో గ్రామ మహిళా సంఘ సభ్యులకు సర్పంచ్ బాస మహేష్ అందజేశారు.

# వనదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు



**వేద న్యూస్, పాపన్నపేట:**

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు బుధవారం కుటుంబ సమేతంగా ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆలయానికి చేరుకోగానే ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్, ముశేటి కిష్టయ్య, ప్రసాద్ గౌడ్, అంజి, భారత్ గౌడ్, ఖలీమ్ మియా, దేవస్థాన సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా సమావేశానికి భారీగా హాజరు కావాలి

## - లియాఫీ 1964 డివిజన్ అధ్యక్షులు పులి సుధాకర్

**వేద న్యూస్, మహబూబాబాద్ :**



భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ 1964) మహబూబాబాద్ బ్రాంచ్ కార్యవర్గ సమావేశం బుధవారం బ్రాంచి కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. బ్రాంచ్ అధ్యక్షుడు పాశం రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వరంగల్ డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఆల్ ఇండియా జనరల్ బాడీ సమావేశానికి మహబూబాబాద్ బ్రాంచ్ నుండి కనీసం 100 మంది ఏజెంట్ మిత్రులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఏజెంట్లు అధిక సంఖ్యలో ప్రైమరీ మెంబర్‌షిప్‌లు తీసుకోవడం ద్వారా యూనియన్ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఏజెంట్ల సంక్షేమం కోసం మెడికల్ క్లెయిమ్ పరిమితిని రూ. 20 లక్షలకు పెంచాలని, గ్రాట్యుటీ మొత్తాన్ని రూ. 20 లక్షలకు పెంచాలని, గ్రూప్ ఇన్సూరెన్స్‌ను రూ. 50 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రూప్ ఇన్సూరెన్స్ అమలులో ఏజెంట్ సేవల కాలాన్ని పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎల్ఐసీ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని, వారికి కార్పొరేషన్ అన్ని రకాల సంక్షేమ ప్రయోజనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డివిజన్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ సరస్వతి, జోనల్ కమిటీ సభ్యుడు శ్రీరాములు, డివిజన్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ బెల్లంకొండ శ్రీనివాస్, డివిజన్ కమిటీ సభ్యుడు బి శ్రీనివాస్ చారి, బ్రాంచ్ ట్రెజరర్ టి. సురేందర్, బ్రాంచ్ రెసిడెంట్ సెక్రటరీ మహిపాల్ రెడ్డి, ముత్యం వెంకన్న, వెంకటేశ్వర్లు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండి మార్కెట్‌లో రైతుల అరిగోస





- మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- గన్నీ సంచుల కొరత వెంటనే నివారించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మార్కెట్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. రైతులు 20 రోజులుగా మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నా కొనుగోళ్లు వేగవంతం కావడం లేదని మండిపడ్డారు. గన్నీ సంచుల కొరత కారణంగా రైతులే సంచులు కొనుగోలు చేసుకునే పరిస్థితి వచ్చిందని, సుతిలి దారం కూడా రైతులే తెచ్చుకోవాల్సి వస్తోందని విమర్శించారు. తడిసిన ధాన్యం, మొక్కజొన్నను ఎలాంటి కొర్రీలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో మధ్య దళారుల దోపిడీ పెరిగిందని, క్వింటాల్‌కు రూ.15 రవాణా పేరుతో అక్రమ వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా సిబ్బంది లేకపోవడం వల్లే జాప్యం జరుగుతోందన్నారు. రైతుల సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించడం లేదని, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎకరానికి 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడం అన్యాయమని, రైతు పండించిన మొత్తం పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉప్పునూటి శ్రీనివాస్, గంగిపెల్లి కుమార్, మారం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

**వేద న్యూస్, రామడుగు:**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామంలో వేముండ్ల రాజయ్య అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తన ఇంట్లో మంచంపై రక్తపు మడుగులో మృతదేహంగా కనిపించాడు. ఈ ఘటనపై మృతుడి కుమార్తె నంగి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన తల్లి కనుకమ్మే రోకలి కర్రతో కొట్టి తండ్రిని చంపినట్లు తనకు చెప్పిందని ఫిర్యాదులో పేర్కొంది. కుటుంబ ఆర్థిక సమస్యలు, అప్పుల కారణంగా రాజయ్య ఎకరం భూమిని అమ్మకానికి పెట్టాడని, ఈ విషయమై గత కొద్ది రోజులుగా కనుకమ్మ, ఆమె తమ్ముడు శేఖర్‌తో రాజయ్యకు గొడవలు జరుగుతున్నాయని తెలిపింది. మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన రాజయ్యను రోకలి కర్రతో కొట్టడంతో మృతి చెందినట్లు తన తల్లి వివరించిందని సుజాత పేర్కొంది. దీంతో కనుకమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేపట్టారు



# చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది

- మంత్రి గడ్డం వివేకానంద
- కొనుగోలు కేంద్రాలు, గోదాములను పరిశీలించిన మంత్రి

**వేద న్యూస్, మంచిర్యాల:**



రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ కొనుగోలు కేంద్రాల ద్వారా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. బుధవారం జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వనజ రెడ్డి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తోందన్నారు. ఈసారి ఎకరానికి 28 నుంచి 32 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని తెలిపారు. జూన్ 4 నాటికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. హమాలీల కొరత నేపథ్యంలో స్థానిక కార్మికులతో కొనుగోలు, రవాణా ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. లారీల కోసం సింగరేణి సంస్థ సహకారం అందిస్తోందన్నారు. కొందరు రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, రైతుల సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఇప్పటివరకు 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. అకాల వర్షాల కారణంగా రైతులకు నష్టం కలగకుండా గోదాముల్లో నిల్వలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తయిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం మంత్రి టేకుమట్ల కొనుగోలు కేంద్రం, బాలాజీ గోదాం, షెట్‌పల్లి కేంద్రం, ఇందారం వరలక్ష్మి రైస్ మిల్, సుముఖ గోదాములను సందర్శించి ధాన్యం నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

# సహజసిద్ధ పద్ధతులతో వ్యవసాయం చేయాలి

- పంట అవశేషాలు కాల్చితే జరిమానా తప్పదు
- వ్యవసాయ అధికారిణి మమత

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ అధ్యక్షతన “దర్తీ మాతా బచావో అభియాన్” నిగ్రాని సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మమత మాట్లాడుతూ రైతులు వరి కొయ్యకాలు, మొక్కజొన్న తదితర పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని సూచించారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు నేల సారం తగ్గిపోతుందని, నేలలోని మిత్ర జీవులు, వానపాములు నశించి పంట దిగుబడిపై ప్రభావం పడుతుందని వివరించారు. పంట అవశేషాలు కాల్చినట్లయితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వానాకాలం సాగుకు సంబంధించి విత్తన ఎంపిక, విత్తన శుద్ధి, లైసెన్సు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి రసీదులు భద్రపరచుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని నెలాఖరులోపు ఆన్‌లైన్ నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. పంట వైవిధ్యీకరణలో భాగంగా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ సమత, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు, నిగ్రాని సమితి సభ్యులు, ఏఈఓ సంపత్, రైతులు పాల్గొన్నారు.



# సిర్నాపల్లి ఇండియన్ బ్యాంక్‌లో నగదు కొరత

- డబ్బుల కోసం ఖాతాదారుల తీవ్ర అవస్థలు
- రోజుకు రూ.5 వేలకే పరిమితమైన చెల్లింపులు

**వేద న్యూస్, ఇందల్వాయి:**




ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి ఇండియన్ బ్యాంక్ శాఖలో గత నెల రోజులుగా నగదు కొరత తీవ్రంగా ఏర్పడటంతో ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు బ్యాంక్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ ప్రభుత్వ పథకాల డబ్బులు ఖాతాల్లో జమ అయినప్పటికీ నగదు లేదంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ఖర్చు చేసి బ్యాంక్‌కు వచ్చినా రోజుకు కేవలం రూ.5 వేల మాత్రమే ఇస్తున్నారని, చాలామంది ఖాళీ చేతులతో వెనుదిరుగుతున్నారని వాపోతున్నారు. వ్యవసాయ పనులు, వైద్య ఖర్చులు, రోజువారీ అవసరాలకు డబ్బులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకులో సరిపడా నగదు నిల్వలు అందుబాటులో ఉంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉపాధి పథకంలో ముఖ గుర్తింపు రద్దు చేయాలి

- పాత విధానాన్నే కొనసాగించాలి
- బహుజన సంక్షేమ సంఘం

**వేద న్యూస్, శాయంపేట:**



ఉపాధి హామీ పథకంలో అమలు చేస్తున్న ముఖ గుర్తింపు విధానాన్ని రద్దు చేసి పాత హాజరు విధానాన్నే కొనసాగించాలని బహుజన సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు మారేపల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఉపాధి పనులకు ఎలాంటి ముఖ గుర్తింపు విధానం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం కారణంగా పలువురు కూలీల ఫోటో లు కెమెరాలో సరిగా నమోదు కాక హాజరు పడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఉపాధి కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి కూలీలకు ఆత్మీయ భరోసా కల్పించాలని ఆయన కోరారు.

# అంబేద్కర్ విగ్రహం వద్ద ఇనుప మెట్లు ఏర్పాటు చేయాలి

**- డిప్యూటీ సీఎం భట్టికి కాంగ్రెస్ నేతల వినతి**



**వేద న్యూస్, ఖమ్మం:**

ఖమ్మం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఇనుప మెట్లు నిర్మాణంతో పాటు ఫౌంటెన్ ఏర్పాటు చేసి సుందరీకరణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. ఖమ్మంలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహం ప్రజలకు ప్రేరణగా నిలుస్తోందని, ప్రతిరోజూ పలువురు నాయకులు, ప్రజలు వచ్చి నివాళులర్పిస్తున్నారని తెలిపారు. పూలమాలలు వేయడానికి సౌకర్యంగా ఇనుప మెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ఫౌంటెన్ నిర్మించి ఆ ప్రాంతాన్ని అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేల్పుల మురళి, కుక్కల రాజా, రఫీ షేక్, సుందర్ రావు, మెరుగు రతన్ రాజు, కోమిరే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఐదుగురికి నాన్‌బెయిలబుల్ వారెంట్

**వేద న్యూస్, శాయంపేట:**

దొంగతనం కేసులో కోర్టు వాయిదాలకు సక్రమంగా హాజరుకాకపోవడంతో ఐదుగురికి పరకాల జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సాయి శరత్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. దొంగతనం కేసులో జనగంధుల సుజాత, కందేల కళ్యాణి, కుంభం లక్ష్మి, కందేళ కళ్యాణ్, కలువల గణేష్‌లపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ కాగా, వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. అదేవిధంగా 2020లో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో మచ్చ సత్యనారాయణపై కూడా నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయినట్లు ఎస్సై తెలిపారు.

వేద న్యూస్

గురువారం మే 28 , 2026

# పెద్దిపై జపాన్ షాక్

వేద న్యూస్ డెస్క్:




రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ క్రీడా యాక్షన్ కథా చిత్రం పెద్ది పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని వార్త ఎదురైనట్లు తెలుస్తోంది. మొదట ఈ చిత్రాన్ని భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గతంలో ఒక భారీ చిత్రం జపాన్‌లో ఘన విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి అభిమాన వర్గం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఆ చిత్రం ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. దీంతో పెద్ది చిత్రాన్ని కూడా జపాన్‌లో ఒకేసారి విడుదల చేస్తే మంచి స్పందన వస్తుందని నిర్మాతలు భావించినట్లు సమాచారం. జపాన్ అభిమానులు కూడా ఈ వార్తతో ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే విడుదలకు కొద్ది రోజుల ముందు చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కొన్ని అనివార్య కారణాల వల్ల జపాన్‌లో అదే రోజు విడుదలను నిలిపివేసినట్లు తెలుస్తోంది. దీంతో నిర్ణయించిన తేదీన అక్కడ ఈ చిత్రం విడుదల కానట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తతో జపాన్‌లోని రామ్‌చరణ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురైనట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రేక్షకులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ వసూళ్ల వద్ద భారీ స్థాయిలో ఫలితాలు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఏఆర్ రెహామాన్ అందిస్తుండగా, విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ చిత్రంపై ఆసక్తి మరింత పెరుగుతోంది.41

# హెబ్బా ఎదురు చూపులు..

వేద న్యూస్ డెస్క్:



హెబ్బా పటేల్ తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించిన హీరోయిన్లలో ప్రత్యేకంగా చెప్పుకునే పేరు. అందం, అభినయం, స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. ప్రస్తుతం మరో బలమైన కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. చిత్ర పరిశ్రమలో ప్రతి ఏడాది ఎన్నో కొత్త కథానాయికలు అడుగుపెడుతుంటారు. అయితే వారిలో కొందరే ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారు. అలాంటి వారిలో హెబ్బా పటేల్ కూడా ఒకరు. మొదటి సినిమాతోనే అమాయకమైన లుక్, సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె.. ఆ తర్వాత వచ్చిన కుమారి 21ఎఫ్ చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ అందుకున్నారు. దర్శకుడు సుకుమార్ కథ అందించిన ఈ సినిమా యువతలో భారీ సంచలనం సృష్టించింది. ముఖ్యంగా హెబ్బా పాత్రలో కనిపించిన గ్లామర్, ఎమోషనల్ నటన ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ చిత్ర విజయంతో టాలీవుడ్‌లో హెబ్బా పేరు ఒక్కసారిగా మార్మోగిపోయింది. నిర్మాతలు, దర్శకులు ఆమెకు వరుస అవకాశాలు ఇవ్వడం ప్రారంభించారు. అయితే తొలి భారీ విజయానంతరం హెబ్బా కెరీర్ ఆశించిన దిశగా సాగలేదనే అభిప్రాయం సినీ విశ్లేషకుల్లో ఉంది. వరుసగా పలు చిత్రాల్లో నటించినప్పటికీ వాటిలో చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయాయి. కథల ఎంపిక, బలమైన పాత్రల కొరత, గట్టి పోటీ వంటి కారణాల వల్ల ఆమె కెరీర్ క్రమంగా మందగించింది. సుమారు పన్నెండుకిపైగా చిత్రాల్లో నటించినప్పటికీ అందులో కొద్ది సినిమాలే విజయాన్ని అందుకోవడంతో అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. ఆ తర్వాత ప్రత్యేక గీతాల్లో కూడా కనిపించిన హెబ్బా.. వాటి ద్వారా మళ్లీ పాపులారిటీ తెచ్చుకునేందుకు ప్రయత్నించారు. కానీ అవి కూడా ఆమె కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల విడుదలైన ఓదెల 2 చిత్రంలో కూడా ఆమె కనిపించి మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. అయితే ఇప్పుడు పూర్తిస్థాయి బలమైన పాత్ర కోసం ఆమె ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో మాత్రం హెబ్బా పటేల్ చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. తరచూ గ్లామరస్ ఫోటోషూట్లు, వ్యక్తిగత అప్‌డేట్లు, కొత్త ప్రాజెక్ట్‌లకు సంబంధించిన పోస్టులతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. ఆమె షేర్ చేసే ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ మంచి స్పందన అందుకుంటున్నాయి ఇక అభిమానులు మాత్రం హెబ్బా మరోసారి మంచి కథ, బలమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు వస్తే తప్పకుండా మళ్లీ ఫామ్‌లోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సరైన అవకాశం దొరికితే హెబ్బా మరోసారి టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ‘పెద్ది’ వివాదానికి ఫుల్‌స్టాప్.. చిరంజీవి జోక్యంతో సర్దుమణిగిన నిర్మాతలు-ఎగ్జిబిటర్లు

వేద న్యూస్ డెస్క్:



టాలీవుడ్‌లో గత కొన్ని రోజులుగా నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య కొనసాగుతున్న రెంటల్-పర్సంటేజీ వివాదానికి ఎట్టకేలకు ముగింపు లభించింది. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది విడుదలకు ముందు తలెత్తిన ఈ సమస్య.. చివరకు చిరంజీవి జోక్యంతో సద్దుమణిగింది. రామ్ చరణ్, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ‘పెద్ది’ చిత్రాన్ని రెంటల్ విధానంలోనే ప్రదర్శించేందుకు ఎగ్జిబిటర్లు అంగీకరించినట్లు సమాచారం. అయితే టికెట్ ధరలు పెంచిన పక్షంలో వచ్చే అదనపు ఆదాయంలో 75 శాతం వాటాను ఎగ్జిబిటర్లకు చెల్లించేలా ఒప్పందం కుదిరినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు పర్సంటేజీ విధానంపైనే పట్టుబట్టిన తెలంగాణ ఎగ్జిబిటర్స్ సంఘం.. చిరంజీవి చర్చల్లో జోక్యం చేసుకోవడంతో తమ వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఫిలిం చాంబర్ కమిటీ నివేదికకు అనుగుణంగా వ్యవహరించాలని కూడా చిరంజీవి సూచించినట్లు సమాచారం. అయితే ‘పెద్ది’ సినిమాకు మాత్రమే ఈ సడలింపు ఇచ్చిన ఎగ్జిబిటర్లు.. జూన్ 30 తర్వాత విడుదలయ్యే చిత్రాలను మాత్రం పర్సంటేజీ విధానంలోనే ప్రదర్శించాలని నిర్ణయించుకున్నట్లు టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఇక ఈ సినిమాకు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో ఉప్పెన వంటి బ్లాక్‌బస్టర్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు.. ‘పెద్ది’తో మరో భారీ హిట్ అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే పోస్టర్లు, గ్లింప్స్, టీజర్‌తో భారీ హైప్ క్రియేట్ చేసిన ‘పెద్ది’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# ‘దృశ్యం 3’కు బాక్సాఫీస్ వద్ద భారీ స్పందన..




వేద న్యూస్ డెస్క్:

మోహన్‌లాల్ హీరోగా తెరకెక్కిన దృశ్యం 3 ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. మే 21న విడుదలైన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన అందుకుంటూ ఇప్పటికే రూ.150 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ‘దృశ్యం’ ఫ్రాంచైజీకి మొదటి రెండు భాగాల నుంచే భారీ అభిమాన వర్గం ఏర్పడింది. ముఖ్యంగా జార్జ్‌కుట్టి పాత్ర చుట్టూ తిరిగే తెలివైన కథనం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో మూడో భాగంపై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా దర్శకుడు మరోసారి ఉత్కంఠభరిత కథతో ప్రేక్షకులను మెప్పించాడని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గతంలో జరిగిన సంఘటనల నుంచి తన కుటుంబాన్ని కాపాడుకున్న జార్జ్‌కుట్టి.. ఈసారి ఎదురయ్యే కొత్త సమస్యలను ఎలా ఎదుర్కొన్నాడు? చట్టం వలలో చిక్కుకున్నాడా? లేక మళ్లీ తన తెలివితో బయటపడ్డాడా? అనే అంశాల చుట్టూ కథ నడుస్తోంది. ప్రతి సన్నివేశంలో ఉత్కంఠను కొనసాగిస్తూ దర్శకుడు కథను ముందుకు నడిపించిన తీరు ప్రేక్షకులను థియేటర్లకు కట్టిపడేస్తోందని టాక్ వినిపిస్తోంది. ఈసారి సినిమాలో కేవలం థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ మాత్రమే కాకుండా భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేశారు. కుటుంబ బంధాలు, భయం, మానసిక ఒత్తిడి, తల్లిదండ్రుల బాధ్యత వంటి అంశాలను హృదయానికి హత్తుకునేలా చూపించారని ప్రేక్షకులు సోషల్ మీడియాలో ప్రశంసిస్తున్నారు. సినిమా విజయాన్ని పురస్కరించుకుని మేకర్స్ తాజాగా ‘బిహైండ్ ద సీన్స్’ వీడియోను విడుదల చేశారు. షూటింగ్ సమయంలో జరిగిన సరదా క్షణాలు, కీలక సన్నివేశాల చిత్రీకరణ కోసం తీసుకున్న శ్రమ, నటీనటుల అనుభవాలను ఇందులో చూపించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానులను మరింత ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో మోహన్‌లాల్‌తో పాటు మీనా, అన్సిబా హసన్, ఎస్తర్ అనిల్, ఆశా శరత్, సిద్ధిఖ్, కళాభవన్ షాజోన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇక ‘దృశ్యం 3’ హిందీ వెర్షన్ కోసం కూడా ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సమాచారం ప్రకారం హిందీ రీమేక్‌ను 2026 అక్టోబర్ 2న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మలయాళంలో సాధించిన విజయాన్ని బాలీవుడ్‌లో కూడా కొనసాగించాలని చిత్ర బృందం భావిస్తోంది. ఈసారి ఎదురయ్యే కొత్త సమస్యలను ఎలా ఎదుర్కొన్నాడు? చట్టం వలలో చిక్కుకున్నాడా? లేక మళ్లీ తన తెలివితో బయటపడ్డాడా? అనే అంశాల చుట్టూ కథ నడుస్తోంది. నడిపించిన తీరు ప్రేక్షకులను థియేటర్లకు కట్టిపడేస్తోందని టాక్ వినిపిస్తోంది.

# మహేష్‌తో నయన్ కోరిక

వేద న్యూస్ డెస్క్:



దక్షిణాది చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్న నయనతార తన అందం, అభినయంతో ప్రత్యేక స్థానం సంపాదిం చుకున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి భారీ అభిమాన వర్గాన్ని ఏర్పరచుకున్నారు. యువ కథానాయకులతో పాటు సీనియర్ నటులతో కూడా కలిసి నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలోని పలువురు అగ్ర నటులతో నయనతార ఇప్పటికే తెర పంచుకున్నారు. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్ వంటి పలువురు ప్రముఖ నటులతో కలిసి విజయవంతమైన చిత్రాల్లో నటించారు. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబుతో మాత్రం ఇప్పటి వరకు ఒక్క సినిమాలో కూడా కలిసి కనిపించలేదు. మహేష్ బాబు, నయనతార కలయికలో చిత్రం రావడానికి గతంలో కొన్ని సందర్భాల్లో చర్చలు జరిగినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. అయితే ఆ సమయంలో ఇతర చిత్రాలతో బిజీగా ఉండటం వల్ల కొన్ని అవకాశాలు ముందుకు వెళ్లలేదని సమాచారం. అలాగే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరో కారణమై ఉండొచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన నయనతార, మహేష్ బాబుతో కలిసి నటించే అవకాశం ఇప్పటి వరకు రాలేదని తెలిపారు. ఒకవేళ అవకాశం వస్తే తప్పకుండా నటిస్తానని ఆమె చెప్పినట్లు సమాచారం. ఈ ఇద్దరి కలయిక ఎప్పుడు తెరపై కనిపిస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రామ్‌కు అనిల్ కథ?

వేద న్యూస్ డెస్క్:



చిత్ర పరిశ్రమలో వినోదం, వాణిజ్య చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి, తన ఉత్సాహభరిత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరో రామ్ పోతినేని కలయికలో సినిమా వస్తే ఎలా ఉంటుందో అన్న ఆసక్తి అభిమానుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు ఈ ఆసక్తికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. చిత్ర నగర వర్గాల సమాచారం ప్రకారం ఈ క్రేజీ కలయిక త్వరలోనే పట్టాలెక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ కలయిక చాలా ఏళ్ల క్రితమే ప్రారంభం కావాల్సి ఉందని చిత్ర పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి గతంలో తెరకెక్కించిన రాజా ది గ్రేట్ కథను మొదట రామ్ పోతినేనిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేశారట. ఆ కథను రామ్‌కు వినిపించినప్పటికీ అప్పట్లో వరుస మాస్ యాక్షన్ చిత్రాలతో బిజీగా ఉండటం వల్ల ఆయన ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లలేదని సమాచారం. ఆ కథ హీరో రవితేజ వద్దకు వెళ్లి భారీ విజయాన్ని అందుకుంది. అప్పటి నుంచి రామ్, అనిల్ రావిపూడి కలయిక ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం అనిల్ రావిపూడి ఇటీవల రామ్‌కు ఒక కొత్త కథాంశాన్ని వినిపించగా అది ఆయనకు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ చిత్రాలతో బిజీగా ఉన్నప్పటికీ వాటిని పూర్తి చేసిన తర్వాత ఈ చిత్రం ప్రారంభం కానుందని చర్చ జరుగుతోంది. అలాగే ఈ చిత్రాన్ని 2027 దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం రామ్ పోతినేని తన సినీ ప్రయాణంలో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. ఆయన కెరీర్‌లో 23వ చిత్రంగా రూపొందనున్న చిత్రం మానసిక ఉత్కంఠతో కూడిన యాక్షన్ కథగా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఇందులో రామ్ వీర అనే పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అనిల్ రావిపూడి కూడా భారీ బహు కథానాయకుల చిత్రంతో బిజీగా ఉన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073